క్లుప్తంగా

హెచ్ఐవీ నివారణపై అవగాహన



దొడ్లేరు(క్రోసూరు): హెచ్ఐవీ నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. శుక్రవారం దొడ్లేరులో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మొబైల్ వాహనం ప్రొజెక్టర్ ద్వారా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంసన్ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి చెందే పద్ధతి, నివారణ చర్యలను వివరించారు. కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త అనుపమ, టీబీ సూపర్‌వైజర్ సౌజన్య, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎల్.నాగలక్ష్మి, కె.ఈశ్వర్, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

భూస్వాములపై ఎగసిపడిన నిప్పుకణిక ఐలమ్మ



సత్తెనపల్లి: భూమి, భుక్తి, పేదల బతుకులు విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్ని కణం చిట్యాల ఐలమ్మ అని రజక యూత్ బాధ్యులు అన్నారు. పట్టణంలోని దోభీఘాట్‌లో చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద శుక్రవారం రజక యూత్ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట పటిమను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రజక యూత్ బాధ్యులు, తదితరులు ఉన్నారు

అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో..

సాయుధ పోరాట ధీరవనిత చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలు అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు మాట్లాడుతూ రజాకార్లను తరిమి కొట్టిన ధిక్కార పతాక వీరనారి చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమరావతి సేవా సమితి సభ్యులు, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



సత్తెనపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ -2025లో శుక్రవారం అచ్చంపేటరోడ్డులో చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయొద్దని, పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో స్వచ్ఛతాహీ సేవ అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. అక్టోబర్ 2 వరకు అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎంపీడీవో పి.రత్నం తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివాజీ, ఏపీఓ ఏడుకొండలు, ఎంఆర్‌సీ బ్రహ్మానందం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



బొల్లాపల్లి: ఉపాధ్యాయుడిగా రాణిస్తూనే ఓ వ్యక్తి డాక్టరేట్ పొందారు. మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్లో లెక్కల ఉపాధ్యాయుడైన ఏకేపీ ప్రకాష్ క్రిస్టియన్ బైబిల్ పఠనం ద్వారా హైదరాబాద్‌కు చెందిన షెపర్డ్ థియోలాజికల్ సెమినరి సంస్థ ద్వారా డాక్టరేట్ పొందారు. ఇటీవల డాక్టరేట్ పట్టాను ఆ సంస్థ నిర్వాహకుల నుంచి అందుకున్నారు. ప్రకాష్ ఆధ్యాత్మికత వైపు మరింత స్థాయికి ఎదగాలని పాఠశాల హెచ్ఎం బ్యూలా హోసన్న, చంద్రజిత్ యాదవ్ తదితరులు అభినందించారు.

దారికొచ్చేదెప్పుడో..

- రోడ్లు అధ్వానం.. ఒళ్లు హూనం
- చినుకు పడితే బురదమయం
- వసతులు లేక పాట్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- సత్తెనపల్లి 3వ వార్డువాసుల అవస్థలు



సత్తెనపల్లి 3వ వార్డులో వానొస్తే రోడ్ల తీరింతే

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో పలుచోట్ల రహదారులు అధ్వానంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని 3వ వార్డులో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. వార్డులో సుమారు 350 పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఇబ్బందికరంగా ఉన్న అంతర్గత రోడ్లపై రాకపోకలు సాగించలేక పోతున్నారు. రోడ్లపై రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. వాహనాల తాకిడికి రోడ్లు గోతులమయంగా మారుతున్నాయి. వాన కురిస్తే దారులు బురదమయమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనచోదకులు అవస్థ పడుతున్నారు.

ఇళ్ల ముంగిటే మురుగు

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చెత్త తీసుకెళ్లేందుకు కూడా వచ్చే పరిస్థితి లేక ఇంటింటి చెత్తసేకరణ నిలిచి పోయింది. ఈ ప్రాంతంలో డ్రెయిన్లు లేకపోవడంతో ఇళ్ల ముంగిటే మురుగు నిలిచి పోతోంది. దీంతో దోమలు అధికమయ్యాయి. వీటి కారణంగా ఈ ప్రాంతవాసులు మలేరియా, డెంగీలాంటి వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షం కురిస్తే వీరి అగచాట్లు అన్నీ ఇన్నీ కావు.

కనీస వసతులేవీ

3వ వార్డులోని శివాజీనగర్ 6వ లైన్ ఎస్‌బీజీ డిగ్రీ, పీజీ కళాశాల సమీపంలో నివసిస్తున్న పేదల సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు లేక కళాశాల పక్కన మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లిస్తూ ఆ ప్రాంతంలో ఉంటున్నవారు దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వం టిడ్కో ఇళ్లు మంజూరు చేసిందని, అక్కడికి వెళ్లిపోతామంటూ పేదలు చెబుతున్నారు. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

అదిగో ఇదిగో..

ఈ ప్రాంత సమస్యలను అనేకసార్లు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారేగానీ సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 17న త్వరలో రోడ్లు వేస్తామంటూ అంచనాలు వేసి మూడు నెలలు దాటినా ఇంత వరకు ఎలాంటి పనులు ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంటిపై కునుకు లేదని పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువలే కానరావు



3వ వార్డులో రాళ్లు తేలి అధ్వానంగా రహదారి

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



బెల్లంకొండ: పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత దూరమవుతుందని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి దీపిక తెలిపారు. శుక్రవారం మండలంలోని మాచాయపాలెంలో స్వస్థనారి– సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90 మంది మహిళలకు వైద్య పరీక్ష నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ కుమార్, సీహెచ్ఓ మణికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ విజయశాంతి, ఏఎన్ఎం వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

అమరావతి: అత్తలూరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ఇన్, ఔట్ పేషెంట్ల రికార్డులను, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ సిస్టం ద్వారా సకాలంలో సిబ్బంది విధులకు హాజరు కావాలన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే



కొమెరపూడి రేణుకా అంకమ్మతల్లి ఆలయంలో



త్రిశక్తి దుర్గాపీఠంలో



అనంతవరం కల్యాణవేంకటేశ్వరస్వామి దేవాలయంలో..

సత్తెనపల్లి: దేవీ శరన్నవరాత్రుల్లో శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. సత్తెనపల్లి వాసవీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో రూ. 30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో శ్రీమహాలక్ష్మీదేవిగా, త్రిశక్తిదుర్గాపీఠంలో కరెన్సీనోట్లతో మహాలక్ష్మీదేవిగా, గుంటూరు రోడ్‌లోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో, వెంకటపతికాలనీలోని శ్రీలక్ష్మీ ప్రత్యంగిరా అమ్మవారిపీఠంలో, మున్సిపల్ కార్యాలయ సమీపంలోని మేదర సంఘ రామాలయంవద్ద, వడ్డవల్లి పెద్దబొడ్డురాయి సెంటర్‌లో, కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టువద్ద, వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. కొమెరపూడిలోని రేణుకా అంకమ్మతల్లి దేవాలయంలో రూ. 4 లక్షల కరెన్సీనోట్లతో, పెదమక్కెన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవార్లను మహాలక్ష్మిగా అలంకరించారు.

బెల్లంకొండ: మహాలక్ష్మీ పీఠంలో శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. నాగిరెడ్డిపాలెంలో శ్రీ దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు



సత్తెనపల్లి శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో రూ. 30 లక్షల కరెన్సీ నోట్లతో అలంకారం

క్రోసూరు: క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అందులో భాగంగా రూ. 65 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అనంతవరం(క్రోసూరు): అనంతవరం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శుక్రవారం కాత్యాయనిదేవీగా భక్తులకు దర్శమిచ్చారు.


ముప్పాళ్ళ: చాగంటివారిపాలెం శ్రీపైడమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

అచ్చంపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అయిదవరోజు అమ్మవారు లక్ష్మీదేవి అమ్మవారిగా భక్తులకు సాక్షాత్కరించారు. శ్రీ సీతారామస్వామి దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

పెదకూరపాడు: గ్రామంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ధనలక్ష్మిగా అమ్మవారు దర్శనం ఇచ్చారు.



బెల్లంకొండలో ధనలక్ష్మీదేవి



చాగంటివారిపాలెంలో ..



అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో..

పత్తి రైతు దిగాలు



అచ్చంపేట మండలంలో నీటమునిగిన పత్తి పంట

- భారీగా పెరిగిన పెట్టుబడులు
- ఎడతెరపి లేని వానలు
- రైతుల ఆందోళన
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పంటమొత్తం వర్షార్పణమే

అచ్చంపేట: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు రైతన్నకు తీవ్ర శోకాన్ని మిగిల్చాయి. తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి రైతులు బెంబేలెత్తుతున్నారు. ముందస్తుగా వేసిన పత్తి పంటలు పూత, పిందె దశకు చేరుకునేదశలో.. కురుస్తున్న వర్షాలకు అవి మొత్తం రాలిపోతున్నాయి. వర్షాలు మరో రెండు, మూడు రోజులు ఇలాగే కొనసాగితే పంట మొత్తం పీకేసుకునే పరిస్థితులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా ఇదే సమయంలో అధిక వర్షాలకు పత్తి పంటలు మొత్తం నీటిపాలై, దిగుబడులు లేక, పెట్టిన పెట్టుబడులు రాక, కాస్తోకూస్తో పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతన్నలు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా అనుకూల పరిస్థితులుంటాయన్న గంపెడాశతో పత్తి పంట వేసిన రైతులు.. కురుస్తున్న భారీ వర్షాలకు బెంబేలెత్తుతున్నారు. గత ఏడాది మిర్చి పంటకు అపార నష్టం వాటిల్లడంతో ఈ సంవత్సరం అచ్చంపేట మండలంలో 6వేల హెక్టార్లకుపైగా పత్తి పంట వేశారు.

పూత రాలే పరిస్థితి

ఒక్కొక్క రైతు ఇప్పటివరకు ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టామని చెబుతున్నారు. కౌలు రైతులైతే ఎకరాకు మరో రూ.20వేల నుంచి 30వరకు భూములను కౌలుకు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆశాజనకంగా ఉన్న పత్తి పంట మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూత, పిందె పూర్తిగా రాలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితులు అనుకూలించినట్లయితే దసరాకు మొదటి కోతపంట చేతికి అందేదని, వర్షాలకు ఆ ఆశ కోల్పోయామని రైతులు చెబుతున్నారు.



ఇంకా కొనసాగితే కష్టమే..

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేలో నీళ్లు నిలబడ్డాయి. వాటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నాం. వర్షాలు ఆగితే పెట్టిన పెట్టుబడులైనా దక్కే అవకాశం ఉంటుంది. మరో రెండు, మూడు రోజులు ఇలాగే కొనసాగితే పూత, పిందె రాలి మొక్కలు నీళ్లలో ఊరకేసిపోతాయి.

– బోదెల హనిమిరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం



గత ఏడాది ఇదే నెలలో..

గత ఏడాది కూడా ఇదే నెలలో వర్షాలు పడి పత్తిపంట మొత్తం దెబ్బతింది. పరిహారం కూడా రాలేదు. ఈసారి కూడా అవే పరిస్థితులొచ్చేటట్లు కనిపిస్తున్నాయి. వరుసగా రెండేళ్లు పంటలు కోల్పోతే వ్యవసాయాన్నే నమ్ముకున్న మాకు దిక్కెవరు. పత్తి పంట వేయాలంటే ఎకరానికి సుమారు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. కనీసం పెట్టుబడులు కూడా రాకపోతే వ్యవసాయం ఏం చేస్తాం. గత ఏడాది మిర్చిలో కూడా నష్టపోయాం.

– సుంకర ప్రతాప్‌రెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

బాలకృష్ణవి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

అమరావతి: బాధ్యతకలిగిన శాసనసభ్యుడైన బాలకృష్ణ దేవాలయంలాంటి అసెంబ్లీలో ఇష్టారాజ్యంగా మాట్లాడటం దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని, సినీ నటుడు చిరంజీవిని కించపరిచేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. వారిద్దరిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను మండల వైఎస్సార్ సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మంగిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే వైఎస్సార్ సీపీ చూస్తూ ఊరుకోదన్నారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్‌విభాగం అధ్యక్షుడు ఆలా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని హితవు పలికారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆర్ఎంపీ విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, తోకల సూరిబాబు, యలగాల పాపారావు, మామిడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ మౌనం వెనక ఆంతర్యమేంటో


అచ్చంపేట: అన్న చిరంజీవిని బాలకృష్ణ కించపరిచేలా మాట్లాడినా డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం సరికాదని జెడ్పీటీసీ సభ్యుడు తమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ శాసనసభలో ఎమ్మెల్యేలు నందమూరి బాలకృష్ణ, కామినేని శ్రీనివాసరావ అసత్య ఆరోపణలు, వారు ప్రయోగించిన అసభ్య పదజాలాలను తీవ్రంగా ఖండించారు. చిరంజీవిపై బాలకృష్ణ ఆరోపణలు చేయడాన్ని కాపు సంఘ నాయకులు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.



విజయప్రతాప్‌రెడ్డి

సంస్కారం లేని బాలకృష్ణ

సత్తెనపల్లి: సభ్యత, సంస్కారం లేని వ్యక్తి బాలకృష్ణ అని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చిట్టా విజయ భాస్కరరెడ్డి విమర్శించారు. సత్తెనపల్లిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో కై కలూరు బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, సినీనటుడు హిందూపురం సీనియర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాటలు చూస్తుంటే చాలా విచిత్రంగా ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కామినేని శ్రీనివాసరావు కించపరుస్తూ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. కామినేని మాటలకు బాలకృష్ణ మాట్లాడిన తీరు చూస్తుంటే ఆయన ఎలాంటి పరిస్థితిలో ఉన్నాడో అర్థమవుతోందన్నారు. చిరంజీవిని కించపరిచేలా బాలకృష్ణ మాట్లాడటం వారి విజ్ఞతను తెలియజేస్తోంది. ఆ సమయంలో స్పీకర్ చైర్‌లో ఉన్న రఘురామకృష్ణంరాజు నైస్ అని సంబోధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ కనీసం ఖండన ఇవ్వలేక పోవడం వెనుక ఆంతర్యమేమిటన్నారు.



మాట్లాడుతున్న చిట్టా విజయభాస్కరరెడ్డి

లోక్ కల్యాణ మేళా

పిడుగురాళ్ల: లోక్ కల్యాణ మేళా గాంధీనగర్‌లోని మెప్మా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీధి విక్రయదారులకు, కుటుంబ సభ్యుల కొరకు ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

● గుంత.. చింత

పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం మీదగా పార్టీ బండ్ల గ్రామానికి వెళ్లే కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు మధ్యలో పెద్ద గుంత ఏర్పడటంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో గుంత కనిపించకద్విచక్రవాహనచోదకులు గాయాల పాలవుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

–పెదకూరపాడు



● పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు

వినుకొండ: పట్టణంలోని పలు పార్సిల్, రవాణా కార్యాలయాల్లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పురుగు మందుల వ్యాపారులు పలువురు ఇతర ప్రాంతాల నుంచి అనధికారికంగా దిగుమతులు చేసుకుంటున్నారనే ఆరోపణలతో ఈ తనిఖీలు చేపట్టినట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు.